క్లుప్తంగా

వెంకటేశ్వరస్వామికి ధనుర్మాస పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

పొదలకూరు: పట్టణంలోని శ్రీలక్ష్మీ గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం తెల్లవారుజామున ధనుర్మాస పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరస్వామి, శ్రీలక్ష్మీ గోదాదేవి అమ్మవార్లకు అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. పలువురు దంపతులు పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: బైక్ పడిపోయి వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కసుమూరులో ఆదివారం చోటుచేసుకుంది. గూడూరు పట్టణానికి చెందిన మునికృష్ణ పనినిమిత్తం బైక్‌పై కసుమూరుకు వెళుతుండగా, ఆటో అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో మునికృష్ణకు గాయాలు కాగా చికిత్సనిమిత్తం 108 వాహనంలో జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోడిపందేల స్థావరాలపై దాడులు



అదుపులోకి తీసుకున్న పందెంరాయుళ్లతో పోలీసులు

కావలి రూరల్: మండలంలోని రాజువారి చింతలపాళెం, పెద్దవరం గ్రామాల మధ్యన అటవీ ప్రాంతంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో రూరల్ ఎస్సైలు ఎం వెంకటరావు, జీ వీరేంద్రబాబు తమ సిబ్బందితో ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 12 మంది పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మూడు కోళ్లు, రూ.15,500 నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఆరుగురు పందెంరాయుళ్ల అరెస్ట్

మర్రిపాడు: మండలంలోని సింగసపల్లి గ్రామ సమీపంలో కోడిపందేల స్థావరం నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఆత్మకూరు సీఐ నాగేశ్వరరావు నేతృత్వంలో పోలీసు సిబ్బంది ఆదివారం సాయంత్రం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆరుగురు పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2,150 నగదు, నాలుగు కోళ్లు, ఆరు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ నాగేశ్వరరావు మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు, జూదాలు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ దాడుల్లో అనంతసాగరం, మర్రిపాడు ఎస్సైలు సంతోష్‌కుమార్‌రెడ్డి, రాజేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అదుపుతప్పిన అంబులెన్స్



ఉదయగిరి: సీతారామపురం వైపు వెళ్తున్న ఓ ప్రైవేట్ అంబులెన్స్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని రోడ్డుపక్కనున్న ఇంట్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటన మండలంలోని కుర్రపల్లి సమీపంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు..ఉదయగిరికి చెందిన శ్యాంసుందర్ తన ప్రైవేట్ అంబులెన్స్ వాహనంలో సీతారామపురానికి వెళుతుండగా కుర్రపల్లి సమీపంలో వాహనం అదుపుతప్పి ప్రమాదం జరిగింది. వాహనంలోని ఎయిర్ బ్యాగులు తెరుచుకోవడంతో శ్యాంసుందర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కౌలు రైతులు సీసీఆర్‌సీలు పొందాలి

కొడవలూరు: మండలంలోని కౌలు రైతులు సీసీఆర్‌సీ(కౌలు కార్డు)లు పొందాలని ఏఓ సీహెచ్‌ఎస్ లక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించినందున కౌలు రైతులు ధాన్యం విక్రయాల కోసం విధిగా సీసీఆర్‌సీ పొందాలని తెలిపారు. అదే విధంగా పంట నమోదు చేసుకొన్న రైతులు ఈ–కేవైసీ విధిగా చేయించుకోవాలని పేర్కొన్నారు. పంట నమోదు అనంతరం ఈ–కేవైసీ చేసుకొన్న రైతులు మాత్రమే కొనుగోలు కేంద్రాల్లో విక్రయాలకు అర్హులని తెలిపారు. మండలంలో పంట నమోదు బాగా వెనుకబడి ఉన్నందున రైతులు పంట నమోదుపై ఆసక్తి చూపాలని తెలిపారు. ఆర్బీకేల్లో సంప్రదించి పంట నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు.

మురిపింఛెన్

నెలకు రూ.1,56,56,000 మేర చెల్లింపు



కలివెలపాళెంలో వృద్ధురాలికి పింఛన్‌ను అందిస్తున్న వలంటీర్

- కొత్త ఏడాదిలో ఆర్థిక తోడ్పాటుతో లబ్ధిదారుల హర్షాతిరేకాలు
- రీ సర్వేలో అర్హులందరికీ పింఛన్లు
- రూరల్ మండలంలో నూతనంగా 208 మందికి మంజూరు



ఈ ఫొటోలోని వ్యక్తి పేరు రమణయ్య. నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్‌మోపూరులో రమణయ్య దంపతులు నివాసం ఉంటున్నారు. ప్రతి నెలా వచ్చే వైఎస్సార్ పింఛన్ కానుకపైనే వీరు ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. తమలాంటి వాళ్లకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని చెప్పారు. పింఛన్‌ను పెంచడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఈ చిత్రంలోని వ్యక్తి పేరు మిట్టకూరు తిరుపాల్‌రెడ్డి. నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్‌మోపూరులో నివాసం ఉంటున్నారు. వీరికి ఎలాంటి ఆస్తుల్లేవు. పిల్లలందరూ వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడి అప్పుడప్పుడూ వస్తుంటారు. ప్రతి నెలా ఇచ్చే వైఎస్సార్ పింఛన్ కానుకే వీరు ఆసరాగా నిలుస్తోంది. పెంచిన పింఛన్‌ను సంక్రాంతికి ముందు అందుకోవడం చాలా సంతోషంగా ఉందని వీరు పేర్కొంటున్నారు.

నెల్లూరు రూరల్: వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారులకు ఆసరాగా నిలుస్తోంది. విడతల వారీగా పింఛన్ మొత్తాన్ని పెంచుతామని హామీ ఇచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆ మేరకు ఈ నెల ఒకటి నుంచి రూ.2750కు పెంచి లబ్ధిదారులకు అందజేశారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు.. ఇలా అన్ని వర్గాల పింఛన్‌దారులకు ఆర్థిక తోడ్పాటునందించారు. రూరల్ మండలంలోని 18 పంచాయతీల్లో ఈ నెల్లో కొత్తగా 208 మందికి పింఛన్లు మంజూరయ్యాయి.

పింఛన్ లబ్ధిదారులిలా..

మండలంలో 5607 పింఛన్లు ఉన్నాయి. వృద్ధాప్య 3127, వితంతు 1226, దివ్యాంగులు 528, డప్పు వాయిద్యకారులు 78, ఒంటరి మహిళలు 135, కల్లు గీత కార్మికులు 64, చేనేత కార్మికులు 240, ఆరోగ్యపరమైన సమస్యలతో బాధపడేవారు 30, హిజ్రా ఒకరు, అభయహస్తం 30, చర్మకారులు 10, కళాకారులు ఎనిమిది మందికి వివిధ పింఛన్లు అందుతున్నాయి. పెంచిన మొత్తంతో కలిపి ఈ నెల్లో కోటి 56 లక్షల 56 వేల నగదును అందజేశారు. పింఛన్లకు సంబంధించిన అర్హత ధ్రువీకరణ చేసుకోవాల్సిందిగా 160 మందికి నోటీసులను గత నెల్లో జారీ చేశారు. రీ సర్వేలో 140 మందిని అర్హులుగా గుర్తించి, వారికి పెంచిన పింఛన్‌ను అందించారు. పరిమితికి మించి ఆస్తులు ఉండటం.. ఆదాయపన్ను లావాదేవీలు ఉన్న కారణంగా 12 మందిని అనర్హులుగా గుర్తించారు. మిగిలిన 8 మందికి సంబంధించిన అర్హత ఈ నెల 15లోపు రుజువు కావాల్సి ఉంది. అర్హులకు పింఛన్‌ను నిలపొద్దని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రీ సర్వేను సైతం త్వరితగతిన పూర్తిచేసి పింఛన్లను అందించడంతో పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. హామీని నెరవేరుస్తూ తమకు ఆర్థిక భరోసా కల్పించిన సీఎంకు కృతజ్ఞతలను తెలుపుతున్నారు.



సౌత్‌మోపూరులో..



ఈ చిత్రంలోని వ్యక్తి ఆములూరు వెంకటరమణయ్య కలివెలపాళెంలో ఉంటున్నారు. గ్రామంలో కూలీ పనులు చేసుకొని జీవనం సాగించేవారు. ప్రస్తుతం దప్పు వాయిద్య కళాకారుడిగా వృత్తి సాగిస్తున్నారు. దప్పు కళాకారుల కోటాలో ఈ నెల్లో రూ.మూడు వేల పింఛన్‌ను అందుకున్నారు. పండగ రోజుల్లో పింఛన్‌ను పెంచడంపై సీఎంకు కృతజ్ఞతలను తెలియజేశారు.



ఈ ఫొటోలోని మహిళ వెంకట సుబ్బమ్మ కలివెలపాళెంలో నివాసం ఉంటున్నారు. సంతానం లేరు. భర్త పెంచలయ్య మరణించారు. గ్రామంలో కూలీ పనులకెళ్తారు. ప్రతి నెలా అందజేస్తున్న వైఎస్సార్ పింఛన్ కానుక ఈమెకు ఆసరాగా నిలుస్తోంది. ఈ నెల్లో రూ.2750 మేర పింఛన్‌ను అందుకున్నారు. విడతల వారీగా పింఛన్ మొత్తాన్ని పెంచడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు.

ఎంతో ఆనందంగా ఉంది



పెంచిన పింఛన్ మొత్తం రూ.2750ను ఈ నెల్లో అందుకోవడం చాలా సంతోషంగా ఉంది. ఇచ్చిన మాటకు కట్టుబడి విడతల వారీగా పింఛన్‌ను పెంచిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. వృద్ధాప్యంలో పింఛన్ కానుక ఎంతో ఆర్థిక తోడ్పాటుగా ఉంటోంది.
– సోమిశెట్టి సత్యనారాయణ, కలివెలపాళెం, నెల్లూరు రూరల్

అర్హులందరికీ అందిస్తున్నాం



మండలంలోని అన్ని ప్రాంతాల్లో అర్హులకు పింఛన్లు అందిస్తున్నాం. కొందరికి సంబంధించి గత నెల్లో అభ్యంతరాలు తలెత్తడంతో సమగ్ర సర్వేను చేపట్టాం. 12 మంది మాత్రమే అనర్హులుగా తేలారు. 8 మంది అర్హత నిర్ధారణ కావాల్సి ఉంది.
– శైలేంద్రకుమార్, నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి ఎంపీడీఓ

ఏపీఎస్ఈబీ నూతన డైరీ ఆవిష్కరణ



ముత్తుకూరు: ఏపీఎస్ఈబీ 2023 సంవత్సరం డైరీని ఆదివారం నేలటూరులోని ఏపీజెన్‌కో కాలనీలో ఉన్న ఫంక్షన్ హాల్‌లో ఆవిష్కరించారు. ఆల్ ఇండియా పవర్ ఇంజినీర్స్ ఫెడరేషన్ చైర్మన్ శైలేంద్ర దూబీ ముఖ్య అతిథిగా పాల్గొని నూతన డైరీని ఆవిష్కరించారు. ప్రధాన కార్యదర్శి రత్నాకర్‌రావు, వైస్ చైర్మన్లు జయంతి, వేదవ్యాసరావు, ఏపీఎస్ఈబీ ఇంజినీర్స్ అసోసియేషన్ అడిషనల్ సెక్రటరీ జనరల్ రత్నాలరావు, ప్రధాన కార్యదర్శి ప్రతాపరెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ నాగప్రసాద్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంజినీర్లు, ఉద్యోగులు ఐకమత్యంతో సమస్యలు పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నిడిగుంటపాళెంలో అయ్యప్ప భక్తుల ర్యాలీ



ర్యాలీ చేస్తున్న అయ్యప్పస్వామి భక్తులు

వెంకటాచలం: హిందూ దేవుళ్లపై భైరి నరేష్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మండలంలోని నిడిగుంటపాళెం గ్రామంలో శబరిమల అయ్యప్ప సేవా సమాజం ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి భక్తులు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. హిందూ దేవతలను హేళన చేస్తూ సనాతన ధర్మాలను, హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన భైరి నరేష్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో పాలూరు రాము, మల్లికార్జునరెడ్డి, నడవల శ్రీనివాసులు, కొలంగిరి సుధాకర్, అసనాపురం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మందుల పంపిణీ



నెల్లూరు(బృందావనం): వికాస్ ఆరోగ్య దీపిక కార్యక్రమంలో భాగంగా పేదలకు మందులను ఉచితంగా ఆదివారం పంపిణీ చేశారు. బాలాజీనగర్‌లోని వికాస్ ప్రజాహిత సేవా సమితి కార్యాలయంలో సంస్థ వ్యవస్థాపకుడు, 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. డాక్టర్ సాయి వినూత్న ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శ్రీనివాసులురెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై రూ.50 వేల విలువైన మందులను పంపిణీ చేశారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ క్యాలెండర్లను అధ్యక్షుడు రఘురామ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో స్టేడియంలో ఆదివారం ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా మేయర్ స్రవంతి హాజరయ్యారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు తిరుపతినాయుడు, మాజీ అధ్యక్షుడు శేషగిరిరావు, రంగారావు, నరసింహారెడ్డి, రమణయ్య, సత్యం, హరిప్రసాద్, సుధాకర్‌చౌదరి, జయవర్ధన్, మురారి, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన అష్టావధానం



నెల్లూరు(బృందావనం): పురమందిర ప్రాంగణంలోని ఏసీ హాల్లో గౌరీభొట్ల రామశర్మ అష్టావధానాన్ని పద్యకళాపరిషత్ అధ్యక్షుడు రామచంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. తొలుత దీపప్రజ్వలన చేశారు. అనంతరం సమాజంలోని ఎన్నో అంశాలను స్పృశిస్తూ ఎందరో కవులు తమ వినూత్న కవితలను చదివి వినిపించారు. వేదసంస్కృత కళాశాల విశ్రాంత ఆంధ్రోపన్యాసకురాలు గిరిజాలక్ష్మి అధ్యక్షతన కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రముఖ సాహితీవేత్త మా శర్మ, విశ్రాంత ఆచార్యుడు సూరం శ్రీనివాసులు, అగస్త్యరాజు సుబ్బారావు, వైద్యుడు సింగరాజు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి రూ.45 వేల వితరణ



నెల్లూరు రూరల్: వేదాయపాళెంలోని స్వర్ణదీపం ట్రస్ట్ అనాథాశ్రమానికి రూ.45 వేల ఆర్థిక సాయాన్ని ఎస్వీఎస్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు. హరనాథపురంలోని స్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ మొత్తాన్ని ట్రస్ట్ నిర్వాహకుడు రఫీకి 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి అందించారు. హైదరాబాద్‌కు చెందిన ఎమ్మెస్సార్ వృద్ధాశ్రమ నిర్వాహకుడు శ్రీనివాస్, ఎస్వీఎస్ స్కూల్ కరస్పాండెంట్ వెంకటేశ్వర్లురెడ్డి, హరిబాబు, అమీర్‌జాన్, హరనాథ్‌రెడ్డి, సుబ్బారెడ్డి, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాజేంద్రనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల పనులను చేపట్టనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో సరఫరా సోమవారం ఉండదని వెస్ట్ – 2 ఏఈ ఉదయ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ములుమూడి బస్టాండ్, గుప్తా పార్క్, తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

వస్త్రాల అందజేత

నెల్లూరు రూరల్: పడారుపల్లిలోని అభయాంజనేయస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని పేదలకు వస్త్రాలను వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మేయర్ స్రవంతి ఆదివారం అందజేశారు. కార్పొరేటర్ శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు పుల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అనిల్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రానున్న ఎన్నికల్లోనూ నెల్లూరు నగర ఎమ్మెల్యేగా అనిల్‌కుమార్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. డివిజన్ ప్రముఖులతో ఆత్మీయ సమావేశాన్ని వికాస్ స్కూల్లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డివిజన్లో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను ఎమ్మెల్యే అనిల్ చేపట్టారని చెప్పారు. అనంతరం సచివాలయ కన్వీనర్లుగా ఎంపికైన వారు, నామినేటెడ్ పదవులు పొందిన వారిని సత్కరించారు.

వేణుగోపాల్ మృతి తీరని లోటు

నెల్లూరు (టౌన్): ఉపాధ్యాయుడు వేణుగోపాల్ మృతి ఎస్టీయూకు తీరని లోటని సంస్థ జిల్లా అధ్యక్షుడు రాజమనోహర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోవూరు మండలంలోని పాటూరు ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ గుండె సంబంధిత సమస్యతో అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారని చెప్పారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

టీడీపీ బీసీ విభాగ సర్వసభ్య సమావేశం

నెల్లూరు (టౌన్): టీడీపీ నెల్లూరు పార్లమెంట్ బీసీ విభాగ సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలోని ఎన్టీ రామారావు, జ్యోతిరావు పూలే విగ్రహాలకు నివాళులర్పించారు. పార్టీ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, మాజీ ఎమ్మెల్యే విజయరామిరెడ్డి, నేతలు సుబ్బానాయుడు, వెంకటేశ్వరరెడ్డి, చెంచలబాబు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

రంగడి దేవస్థానంలో రాపత్తు ఉత్సవం



నెల్లూరు(బృందావనం): అధ్యయనోత్సవాలను పురస్కరించుకొని నగరంలోని తల్పగిరి రంగనాథ స్వామి దేవస్థానంలో రాపత్తు ఉత్సవాన్ని నేత్రపర్వంగా ఆదివారం నిర్వహించారు. దేవస్థాన ప్రధానార్చకులు జగన్నాథాచార్యులు, సుదర్శనాచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఉభయకర్తగా వెంకటసుబ్బయ్యశెట్టి వ్యవహరించారు. ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



నెల్లూరు రూరల్: రూరల్ పరిధిలోని 41వ డివిజన్లో గల పరమేశ్వరినగర్‌లో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపనను వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. కార్పొరేటర్ విజయలక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు మురళీకృష్ణ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్‌పై దాడి

నెల్లూరు(క్రైమ్): ఆటోడ్రైవర్‌పై కొందరు దాడి చేసిన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కొత్తూరులోని వైఎస్సార్‌నగర్‌లో నివాసం ఉంటున్న సుబ్బరాయుడు ఆటో నడుపుకొని జీవనం సాగిస్తున్నారు. నగరానికి చెందిన ఇస్మాయిల్ ఈయన స్నేహితుడు. ఇస్మాయిల్ తన భార్యతో విడిపోయి దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో వారం క్రితం స్నేహితుడి భార్యతో ఫోన్లో సుబ్బరాయుడు మాట్లాడి.. విభేదాలను వీడి కాపురాన్ని చక్కదిద్దుకోవాలని కోరారు. ఈ తరుణంలో ఆటోలో సుబ్బరాయుడు వెళ్తుండగా, డెయిరీ వద్దకు వచ్చేసరికి శ్రీను, సురేష్, బన్నీ, రాజేష్ అటకాయించారు. ఆమెతో ఫోన్లో లేనిపోని మాటలు ఎందుకు మాట్లాడుతున్నావు.. తమ గురించి ఎందుకు చెప్తున్నావంటూ దాడి చేశారు. గాయపడిన సుబ్బరాయుడు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేరారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(సెంట్రల్): రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టీటీడీ న్యూఢిల్లీ స్థానిక సలహామండలి చైర్‌పర్సన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని నగరంలోని వారి నివాసంలో వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా వీరిని సత్కరించారు.